క్లుప్తంగా

రైతులను ఆదుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మండల బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ...వర్షాల వల్ల రైతులు అధికంగా నష్టపోయారని, ఇళ్లు దెబ్బతిన్నాయని, రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్, భూషణం, సాయిలు, కృష్ణ, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



పార్టీలో చేరిన నాయకులకు కండువా కప్పుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

నర్సాపూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపడుతున్న పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కార్యకర్తలు బీజేపీలో చేరుతున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ అన్నారు. శనివారం నర్సాపూర్ మున్సిపాలిటీలోని చైతన్యపురి కాలనీకి చెందిన రాజు, రాణి ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి సురేశ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేశ్ గౌడ్, పార్టీ నాయకులు నగేశ్, రమేశ్‌గౌడ్, నారాయణరెడ్డి, నాగరాజు, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజమే



బాలయ్యను సన్మానిస్తున్న సిబ్బంది

నిజాంపేట(మెదక్): ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమేనని మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు పేర్కొన్నారు. నిజాంపేట మండల కేంద్రంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ బాలయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలయ్య దంపతులను ఎంపీడీఓ రాజిరెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ నర్సింహారెడ్డి, ఏపీఓ శ్రీనివాస్, కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి-శంకరపేట రోడ్డు మరమ్మతులు



నార్సింగి రోడ్డు గుంత పూడుస్తున్న అధికారులు

పాపన్నపేట(మెదక్): ఇటీవల కురిసిన వర్షాలకు పాడైన పాపన్నపేట -శంకరంపేట రోడ్డుకు రోడ్లు భవనాల శాఖ అధికారులు శనివారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. నార్సింగి శివారులో కల్వర్టు వద్ద పెద్ద గొయ్యి ఏర్పడగా నార్సింగి నుంచి అవతలి వైపు వెళ్లేందుకు మట్టి పోసి గుంతను పూడ్చేశారు. కొత్తపల్లి అనంతుని వాగుకు ఇరు ప్రక్కల రోడ్డు దెబ్బతిని యేళ్లు గడుస్తున్నా అధికారులు,ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని వెంటనే ఈ రోడ్డును కూడా బాగుచేయాలని మండల బీజేపీ నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



తూప్రాన్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

తూప్రాన్: ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తిపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసిస్తూ బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నర్సాపూర్ చౌరస్తా వద్ద రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ తల్లిపై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్‌శాఖ అధ్యక్షుడు జానకిరామ్ గౌడ్, తాటి విట్టల్, యాదగిరి, మహేశ్ గౌడ్, వెంకట్, నవీన్ పాల్గొన్నారు.

జాబితాపై అభ్యంతరాలు తెలపండి

చిన్నశంకరంపేట(మెదక్): ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే చెప్పాలని డీఎల్‌పీఓ సురేశ్ బాబు కోరారు. శనివారం మండలంలోని అంబాజిపేట పంచాయతీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం జిల్లాలోని అన్ని మండల కార్యాలయాలలో ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై ఆరాతీశారు.



పలు పార్టీల ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమాదేవి

ఓటరు జాబితాపై సమావేశం

వెల్దుర్తి(తూప్రాన్): ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, ఇతర సమస్యలపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఎంపీడీఓ ఉమాదేవి చర్చించారు. ఓటరు జాబితాను పకడ్బందీగా చేపట్టామని, ఏవైనా అభ్యంతరాలుంటే ఆదివారం సాయంత్రంలోగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటరు జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంచామని తెలిపారు. తుది ఓటరు జాబితాను సెప్టెంబర్ 2న ప్రచురించనున్నట్లు చెప్పారు. సమావేశానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మండల అధ్యక్షులు మహేశ్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, దాస్, నాయకులు నరేందర్‌రెడ్డి, బాలకిషన్, హన్మేష తదితరులు పాల్గొన్నారు.

జాబితాపై అవగాహన

పెద్దశంకరంపేట (మెదక్): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాపై ఆయా పార్టీల నాయకులకు ఎంపీడీఓ షాకీర్ అలీ అవగాహన కల్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఇప్పటికే ఆయా గ్రామాలలో ఓటరు జాబితాను పంచాయితీలో ప్రదర్శించామన్నారు. ఇందులో వార్డుల వారీగా తప్పులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ జాకీర్‌హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు.



జీపీ రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీఓ సురేశ్‌బాబు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని బద్దారంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రజలు కుల మతాలకు అతీతంగా కలిసి మెలిసి ఉండాలని, పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, శాంతిభద్రతలకు సహకరించాలని సూచించారు. మద్యం సేవించి ఇతరులను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తండావాసులకు సరుకులు పంపిణీ



తండావాసులకు సరుకులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

హవేళిఘణాపూర్(మెదక్): వరదలతో తిండిలేక అల్లాడుతున్న మండల పరిధిలోని దూప్‌సింగ్ తండా ప్రజలకు ఆయా స్వచ్ఛంద సంస్థల సభ్యులు ముందుకువచ్చారు. హిందూ ధార్మిక సంస్థలైన వాసవీక్లబ్ సత్యసాయి బాబ ఆశ్రమం, భాగ్యలక్ష్మి వెల్‌నెస్ క్లబ్ స్నేహితులతో కలిసి తండావాసులకు నిత్యావసర సరుకులను అందజేశారు. తండాకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో ట్రాక్టర్ ఏర్పాటు చేసుకొని వెళ్లి మరీ పంపిణీ చేశారు. తమ ఇబ్బందులను గుర్తించి సాయం చేసిన స్వచ్ఛంద సంస్థలకు తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రవీందర్, శివ, సాయికుమార్, శ్రీపాల్, ఎంఎల్ఎన్ రెడ్డి, రామకృష్ణ, రంజిత్, తండావాసులు ఉన్నారు. అలాగే మెదక్ పట్టణానికి చెందిన ముస్లింలు, నాయకులు ట్రాక్టర్‌లో నిత్యావసర సరుకులు తీసుకువచ్చి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెదక్ మిల్లి అసోసియేషన్ నాయకులు డాక్టర్ సుఫీ, సుజాయత్‌అలీ, రియాజ్, జుబేర్, ఫాజిల్, అతీక్, ఇమ్రాన్, ఉమర్, అబేద్ తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్‌లో తాగు నీటి సమస్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రంలో మూడు రోజులుగా తాగునీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామంలో పలువురి వద్ద ఉన్న సింగిల్ ఫేజ్ బోర్లను ఆశ్రయిస్తున్నారు. గ్రామంలో మూడు రోజులుగా పనులు మానుకుని తాగునీటిని తెచ్చుకుంటున్నామని, నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా.. మూడు రోజులుగా మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు జరుగుతున్నాయని, పైనుంచే సరఫరా నిలిపి వేశారని తెలిపారు. గ్రామంలో ప్రత్యామ్నాయంగా నీటి సరఫరా చేస్తున్నామని చెప్పారు.



సింగిల్ ఫేజ్ బోరు వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న కృష్ణాగౌడ్

ఎస్సై కృష్ణాగౌడ్

సదాశివపేట(సంగారెడ్డి): సైబర్ నేరాలపై సమాజంలోని ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని ఎస్సై కృష్ణాగౌడ్ స్పష్టం చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు శనివారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రస్తుతం సైబర్ నేరాలు చాలా పెరుగుతున్నాయన్నారు. వాట్సప్‌లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయవద్దని, సైబర్ నేరాల్లో ఎక్కువగా విద్యావంతులే ఎక్కువగా మోసపోతున్నారని చెప్పారు. మల్టీలెవల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయని వివరించారు. తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ వివరాలు చెప్పాలని కోరితే చెప్పవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు వరంగా సీఎంఆర్ఎఫ్

ఆత్మకమిటీ చైర్మన్ కచూర్‌రావు

వట్‌పల్లి(అందోల్): పేదలకు ఆపత్కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం ఆర్ఎఫ్) వరంలా ఉపయోగపడుతోందని రాయికోడ్ ఆత్మకమిటీ చైర్మన్ కచూర్‌రావు పేర్కొన్నారు. వట్‌పల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్‌జ్యోషితో కలసి ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 22 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.10.05లక్షల విలువైన చెక్కులను సదరు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కచూర్‌రావు మాట్లాడుతూ...పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక చేయూతను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సంగారెడ్డి, అశోక్‌గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్ పాటిల్, ఏయంసీ డైరెక్టర్ దిగంబర్‌రావు, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, నాయకులు గోపాల్‌రెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న నాయకులు

కలిసి ఉంటేనే గ్రామాల అభివృద్ధి : ఎస్ఐ

టేక్మాల్(మెదక్): ప్రజలంతా కలిసి ఉంటేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎస్ఐ రాజేశ్ అన్నారు. శనివారం మండలంలోని ఎలకుర్తిలో ఆర్ఐ సాయిశ్రీకాంత్‌తో కలిసి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతిని పాటించరాదన్నారు. కులమతాలు తారతమ్యం లేకుండా కలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ హాస్టల్ వార్డెన్ విక్రం స్వామి, కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు మాణయ్య, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్‌లను నియమించాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం

వెల్దుర్తి(తూప్రాన్): పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల స్థానంలో వెంటనే విద్యా వాలంటీర్లను నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీటీ ఉపాధ్యాయులుగా సేవలందించి ఇటీవల ప్రభుత్వం చేపట్టిన పదోన్నతుల ప్రక్రియలో ప్రాథమిక పాఠశాలలను వదిలి వెళ్లారన్నారు. దానిని దృష్టిలో ఉంచుకొని వారి స్థానంలో విద్యా వాలంటీర్లను నియమించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పాఠశాలలకు వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.

మార్పుల కోసం 199 అర్జీలు

కౌడిపల్లి(నర్సాపూర్): ఓటరు జాబితాలో వార్డు మార్పు చేయాలని 199 మంది ఓటర్లు దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 28న మండల కార్యాలయంతో పాటు, అన్ని గ్రామాలలో ఓటరు జాబితాను ప్రదర్శించినట్లు తెలిపారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీలకు గాను 23 పంచాయతీలలో 199 మంది ఓటర్లు తమ ఓటు వేరే వార్డులో వచ్చిందని, వార్డును మార్పు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు చేసినట్లు చెప్పారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

పటాన్‌చెరు టౌన్: ఇంద్రేశం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డిని శనివారం కాంగ్రెస్ శ్రేణులు కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనను సన్మానించి, సీఎం చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఐలాపురం నాగరాజు, రవీందర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, భుజంగారెడ్డి, లక్ష్మీహరి నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నారాయణఖేడ్: ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, కళాశాల వసతి గృహాల్లో పనిచేస్తున్న కార్మికులకు గత ఏడు నెలలుగా వేతనాలు రాక కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. పెండింగ్ వేతనాల చెల్లింపుతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించి ఆరోగ్య, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు.

కుందలమ్మ అలుగు అందాలు



అలుగు పారుతున్న కుందలమ్మ చెరువు

భారీ వర్షాలకు మండలంలోని అన్ని చెరువులు, కుంటలు నిండి మత్తడి దూకుతున్నాయి. దొంతి కుందలమ్మ చెరువు అలుగు పారుతున్న దృశ్యాలు జలపాతం అందాలను తలపిస్తున్నాయి. గ్రామస్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు అలుగు వద్ద ఫొటోలు దిగుతూ సందడి చేస్తున్నారు.

– శివ్వంపేట(నర్సాపూర్):

యూరియా కోసం రైతుల అవస్థలు



యూరియా కోసం క్యూలైన్‌లో రైతులు

చేగుంట(తూప్రాన్): నెలరోజులు గడుస్తున్నా రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. శనివారం చేగుంటలోని రైతు వేదిక వద్ద ఉదయం నుంచి టోకెన్ల కోసం రైతులు పడిగాపులు కాశారు. చేగుంటకు 900 యూరియా బస్తాలు వచ్చాయి. పోలీసుల సహకారంతో రైతులకు పంపిణీ చేశారు. మక్కరాజీపేట సహకార సంఘంలో 450 బస్తాల యూరియా రాగా సగం మంది రైతులకు మాత్రమే అందింది. దీంతో మళ్లీ తెప్పించి అందరికీ అందేలా చూస్తామని వ్యవసాయ అధికారులు రైతులను సముదాయించి పంపించారు.

ఆస్ట్రేలియాలో విద్యావకాశాలపై అవగాహన

నర్సాపూర్: ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యా అవకాశాలపై ఆస్ట్రేలియా లీడర్స్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ బెన్ అరాచి విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆస్ట్రేలియాలో పుష్కలంగా విద్యా, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అనంతరం కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ విదేశాలలో విద్య, ఉపాధి అవకాశాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, సొసైటీ రీసెర్చ్ డీన్ రాజు, ఇతర ప్రతినిధులు ప్రణీత, నాగేశ్వరరావు, శ్రీనివాస్‌రావు, మేనేజర్ బాపిరాజు, ఏఓ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌కు తమ విద్యా సంస్థ పుస్తకం అందజేస్తున్న బెన్ అరాచి

విద్యార్థులకు ప్రాథమిక అంశాలు తప్పనిసరి



గౌతాపూర్‌లో విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న ఎంఈఓ విఠల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతి విద్యార్థికి ప్రాథమిక స్థాయి అంశాలు వచ్చి ఉండాలని మండల విద్యాధికారి విఠల్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని గౌతాపూర్ తండా, గౌతాపూర్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు బేసిక్ లర్నింగ్ ప్రోగ్రాంలో భాగంగా ప్రతి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేస్తామన్నారు. పాఠశాలలోని ప్రతి విద్యార్థికి చదవడం, రాయడంతోపాటు, కూడిక, తీసివేత, గుణాకార, భాగహారాలతో పాటు ఎక్కాలు తప్పనిసరిగా వచ్చి ఉండాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చండూర్ కాంప్లెక్స్ హెచ్ఎం రమేశ్ , పాఠశాల హెచ్ఎం సర్వన్ పాల్గొన్నారు.

గోడ కూలింది..గోడు మిగిలింది

చిన్నశంకరంపేట (మెదక్): ఈ ఫొటోలో కన్పిస్తున్న వృద్ధురాలి పేరు వడ్డె రామవ్వ. చిన్నశంకరం పేట మండలం ధరిపల్లి గ్రామానికి చెందిన ఈమె వినాయకచవితి పండుగ ఏర్పాట్లలో నిమగ్నమైంది. అదే సమయంలో ఇంటి వెనుక గోడ నుంచి పెద్ద శబ్దం వినిపించింది. ఏమైందోనన్న ఆందోళనతో బయటకు వచ్చి చూసేసరికి భోరున కురుస్తున్న వర్షంతో తన ఇంటి గోడ మట్టిపెళ్లలు రాలిపడ్డాయి. గ్యాస్ స్టౌవ్ అయినా బయటకు తెచ్చుకుందామనుకుని మళ్లీ లోపలికి వెళ్లేసరికి ఒక్కసారిగా ఇంటి గోడ కూలిపోయింది. వెంటనే అప్రమత్తమైన రామవ్వ పరుగున బయటకు వచ్చి ప్రాణాలు నిలుపుకుంది. ఉన్న గూడు కూలడంతో గ్రామపంచాయతీ వద్దకు చేరుకుంది. అక్కడ పెట్టింది తిని మూడు రోజులు గడిపింది. వర్షం తగ్గడంతో ఇంటికి వెళ్లి చూస్తే సామాన్లపై మట్టిపెళ్లలు పడి పనికిరాకుండా పోయాయి. వాటిని తిరిగి సమకూర్చుకునేంత ఆర్థిక శక్తి కూడా రామవ్వకు లేదు. దీంతో ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆశగా ఎదురు చూస్తోంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో హృదయాన్ని కలచివేసే ఘటనలకు ఇదో ఉదాహరణ మాత్రమే.



కూలిన ఇంట్లో వేదనతో కూర్చున్న వడ్డే రామవ్వ

విద్యార్థుల భాగస్వామ్యం అవసరం

నర్సాపూర్: ప్రొఫెషనల్ సొసైటీలలో చురుకైన విద్యార్థుల భాగస్వామ్యం అవసరమని ఉస్మానియా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భారతి చెప్పారు. శనివారం బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరిశోధన, సహకారం, ఆవిష్కరణలను మెరుగుపర్చడానికి ఐఈఈఈ, ఏపీఎస్ వంటి ప్రొఫెషనల్ సొసైటీలలో చురుకైన విద్యార్థుల భాగస్వామ్యం అవసరం ఉందని వివరించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, హెచ్ఓడీ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబానగర్‌కు నిలిచిన రాకపోకలు



రాకపోకలు పునరుద్ధరించేందుకు కాల్వను తవ్వుతున్న జేసీబీ

కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు

జహీరాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల మండలంలోని రంజోల్ గ్రామ పరిధిలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు చేరి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో మూడు రోజులుగా బ్రిడ్జి నుంచి బాబానగర్ గ్రామానికి, వ్యవసాయ పొలాలకు రాకపోకలను పూర్తిగా నిలిచిపోయాయి. ఈ విషయాన్ని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా...నీటిపారుల శాఖ, మున్సిపల్ శాఖ, పోలీసు శాఖల అధికారుల సహకారంతో శనివారం రాకపోకలను పునరుద్ధరించే పనులు చేపట్టారు. బాబానగర్‌కు గతం నుంచి ఉన్న కెనాల్‌ను తవ్వించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264